సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 24 । మార్చి । 2023



31న డాక్ అదాలత్


బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు 'డాక్ అదాలత్' నిర్వహించనున్నారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అడబాల శ్రీరామారావు (కాకినాడ) రూ.1,00,116 విరాళాన్ని గురువారం దేవస్థానం అధికారులకు సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1850,మధ్య డెల్టాకు 1200,పశ్చిమ డెల్టాకు 3200క్యూసెక్కులు వదిలారు.



న్యూస్‌రీల్

అకాల వర్షాలకు పంట నష్టం

తొమ్మిది మండలాల్లో 35 గ్రామాల్లో వర్ష ప్రభావం

కొవ్వూరు: జిల్లాలో ఇటీవల భారీ వర్షాల కారణంగా తొమ్మిది మండలాల పరిధిలో 439.14 హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. 263.54 హెక్టార్లలో మొక్కజొన్న, 161 హెక్టార్లలో వరి, 4 హెక్టార్లలో మినుము, రెండేసి హెక్టార్లలో పొద్దుతిరుగుడు, పొగాకు ఐదు హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది సర్వే నిర్వహించాక నష్టంపై నివేదిక తయారు చేస్తామని ప్రకటించారు. ప్రధానంగా సీతానగరం మండలంలో 233 హెక్టార్లు, నల్లజర్ల మండలంలో 16 గ్రామాల పరిధిలో 122, కొవ్వూరులో 34, దేవరపల్లి మండలంలో 36 హెక్టార్లు,చాగల్లులో 6, కోరుకొండలో1 హెక్టారు, గోకవరంలో 2, నిడదవోలులో 0.14 హెక్టారలో పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనాకు వచ్చామని ఆయన వివరించారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్) సంయుక్త ఆధ్వర్యంలో పీఎంకేవీవై 4.0 పథకం ద్వారా నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని నేక్‌లో మూడు నెలల పాటు ఈ శిక్షణ జరుగుతుందని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.తిరుమలరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు గురువారం ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, పీజీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం నేక్‌లో ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వివరాలకు 96667 70760, 89197 84495 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గతవారం నిర్దేశించిన లక్ష్యానికి సంబంధించి 482 ఇళ్లకు 203 నిర్మాణాలు పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్నవాటితో కలిసి ఈ వారం లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురాంతో కలసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు వారాల్లో 2,519 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా, వాటిలో 1,796 రూఫ్ లెవెల్, రూఫ్ కంప్లీట్ అయినవి 723 ఉన్నాయన్నారు. ఆయా ఇంటి నిర్మాణాలను ఏప్రిల్ 8 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి వారం జిల్లాలో 482 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కోరుకొండ, కడియం, చాగల్లు, గోకవరం, రాజానగరం, కొవ్వూరు అర్బన్, రూరల్, పెరవలి మండలాల్లో 10 శాతం కంటే తక్కువ పురోగతి ఉందన్నారు. జిల్లా సగటు పురోగతి 14 శాతం ఉందని, నూరుశాతం సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గర్భిణుల్లో రక్తహీనతను నివారించే దిశగా వారి ఆహారంలో విటమిన్లు సమృద్ధిగా ఉండేలా వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తున్నామని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. పాఠశాల విద్య, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్పందన, గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా చేపట్టి, అమలు చేస్తున్న లక్ష్యాల పురోగతిపై గురువారం వెలగపూడిలోని క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 7,784 పిల్లలకి పోష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆరు సంవత్సరాల వయసున్న 96,455 మంది పిల్లలను గుర్తించి, ఇప్పటివరకు 55 శాతం ఆధార్ నవీకరణ చేశామన్నారు.

దాహార్తికి చెక్..!



- తాగునీటి ఎద్దడి నివారణకు సన్నద్ధం
- వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన
- బోర్లు, చేతి పంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు
- ప్రస్తుతానికి తాగునీటి పథకాల్లో సమృద్ధిగా నీరు
- ఏప్రిల్, మే నెలల్లో కొంత మేర ఎద్దడికి ఆస్కారం

సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్ర విపత్తుల శాఖ సూచనల మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వేసవిలో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సూచనల మేరకు వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు గ్రామీణ నీటి పారుదల శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్) సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు అవసరమైన ముందస్తు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేసింది. ఇందులో తాగునీరు సరఫరా చేసే బోర్లు, పైప్‌లైన్లు, చేతిపంపుల మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన నిధులు ఇప్పటికే కేటాయించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికు జిల్లా కలెక్టర్ మాధవీలత నేతృత్వంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మునిసిపల్, ఎంపీడీఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దాహార్తి తీర్చే దారులపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

సమాచారం సేకరణ

జిల్లాలో 18 మండలాలు, 299 గ్రామ పంచాయతీలు, 482 ఆవాసాల్లో 14.41 లక్షల జనాభా నివసిస్తోంది. ప్రజలకు తాగునీటి అందించే ప్రధాన వనరు అఖండ గోదావరి. గోదావరి ద్వారా ప్రజలకు రక్షిత జలాల సరఫరాకు ఏడు సీపీడబ్ల్యూ స్కీమ్‌లు, 921 పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ స్కీములు, 2,234 చేతిపంపులు లాంటి బృహత్తర తాగునీటి పథకాలు పనిచేస్తున్నాయి. గోదావరి ద్వారా సేకరించిన నీటిని తాగునీటి స్కీముల ద్వారా ప్రజలకు అందజేడయం పరిపాటి. ప్రస్తుతం గోదావరిలో నీటి లభ్యత ఉండటంతో నెలాఖరు వరకు నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి లేదని అధికారులు నిర్ధారణకు వచ్చారు. రానున్న నాలుగు నెలల్లో ఎక్కడెక్కడ నీటి వెతలొచ్చే అవకాశం ఉందోనని ఆర్‌డబ్ల్యూఎస్ క్షేత్ర స్థాయి నుంచి సమాచారం సేకరించింది.

యాక్షన్ ప్లాన్ రూపకల్పన

ఏప్రిల్‌లో 12 మండలాల పరిధిలో 20 గ్రామాల్లో, మే మాసంలో 12 మండలాల పరిధిలో 28 గ్రామాల్లో నీటి సమస్యల తలెత్తే ఆస్కారం ఉందని అధికారులు అంచనా వేశారు. వేసవి గట్టెక్కాలంటే బోర్ల మరమ్మతులకు రూ.10 లక్షలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు సన్నద్ధంగా ఉన్నారు. జిల్లాలో ఆఖండ గోదావరి నెలవై ఉన్న కారణంగా నీటి ఎద్దడి నెలకొనే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. రెండు మాసాలు మాత్రం కొన్ని గ్రామాల్లో బోర్లలో నీరు అడుగంటే పరిస్థితి ఉందని, వాటిని ఫ్లషింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు యాక్షన్‌ప్లాన్‌లో పొందుపరిచారు.

ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో గుర్తించిన అవాసాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. బోర్ వెల్స్, చేతి పంపులు మరమ్మత్తులు చేపట్టనున్నారు. మంచినీటి ట్యాంకుల పరిస్థితి, లీకేజీలను పరిశీలిస్తారు. ట్యాంకుల మరమ్మతులు, శుభ్రం చేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

మూగజీవాలకు సైతం

గ్రామాల్లో మూగజీవాలకు సైతం తాగునీటిని అందించేందుకు నీటి టబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆర్వో ప్లాంట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పనిచేయని చేతిపంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టనున్నారు. అయితే వేసవిలో నీటి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే పరిస్థితులు దాదాపుగా తలెత్తవని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్, మే మాసాల్లో బోర్లలో నీటి లభ్యత తగ్గే ప్రాంతాలను గుర్తించారు. 18 మండలాల పరిధిలో 82 గ్రామాలుగా అంచనా వేశారు. వాటికి అనుగుణంగా బోర్లను ఫ్లషింగ్ (బోర్లు శుభ్రం చేయడం) చేసేందుకు రూ.10 లక్షల నిధులతో అంచనాలు రూపొందించారు. వాటి వివరాలు పరిశీలిస్తే..

మండలం	నీటి ఎద్దడి గ్రామాలు (అంచనా)	బోర్ల ఫ్లషింగ్‌కు నిధులు (రూ.లక్షల్లో)
రాజమండ్రి రూరల్	6	0.96
కడియం	4	0.64
పెరవలి	4	0.64
నిడదవోలు	5	0.8
ఉండ్రాజవరం	3	0.48
బిక్కవోలు	4	0.64
రంగంపేట	11	1.10
రాజానగరం	10	1.00
కోరుకొండ	13	1.30
సీతానగరం	10	1.00
గోకవరం	8	0.80
గోపాలపురం	1	0.16
కొవ్వూరు	3	0.48



కడియం మండలంలో తాగునీటి ట్యాంక్

ముందస్తు కార్యాచరణ



వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాం. నీరు అందించే పథకాల మరమ్మతులు, శుభ్రం చేయడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశాలిచ్చాం. మంచినీటి చెరువులకు కాలువల ద్వారా నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని అందించేందుకు సన్నద్ధంగా ఉన్నాం. మూగ జీవాలు సైతం తాగునీటికి తల్లడిల్లకూడదని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నాం. ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటుకు ఆదేశాలిచ్చాం.

- కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

నీటి లభ్యత తగ్గే గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ



వేసవితో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే మాసాల్లో బోర్లలో నీటి లభ్యత తగ్గే ప్రాంతాలను గుర్తించాం. వాటిని శుభ్రం చేసి నీటి పుష్కలంగా అందేలా చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బోర్ల ఫ్లషింగ్‌కు నిధులు ఈ మేరకు అవసరమో అంచనాలు రూపొందించాం. ఏ ప్రాంతంలోనూ దాహార్తి నెలకొనే పరిస్థితి రాకుండా చూస్తాం. దాతల సహకారంతో చలివేంద్రాల ఏర్పాటుకు సైతం కృషి చేస్తాం.

- డి.బాలశంకర్‌రావ్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్

అంకితభావానికి 'పెద్ద' పీట

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఇజ్రాయిల్
- సామాజిక సమతూకం పాటించిన వైఎస్సార్ సీపీ



ఎమ్మెల్సీగా గెలిచిన ఇజ్రాయిల్‌ని అభినందిస్తున్న ఎంపీ అనురాధ తదితరులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: చరిత్రలో తొలిసారి మాదిగ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ పెద్ద పీట వేసింది. గురువారం ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన బొమ్మి ఇజ్రాయేల్ విజయం సాధించారు. ఈ ఎన్నికతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ చరిత్రలో ఆ సామాజిక వర్గానికి పెద్దల సభలో తొలిసారి ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్సీ బీసీలకు ప్రాధాన్యతను ఇస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలలో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణరావును ఎమ్మెల్సీగా చేశారు. ఈ రెండు సామాజికవర్గాలతో పాటుగా గవర్నర్ కోటాలో మత్స్యకార సామాజికవర్గం(వాడబలిజ) నుంచి కర్రి పద్మశ్రీని ప్రతిపాదించారు. ఇలా ఎస్సీ బీసీలకు పార్టీ విధానపరంగా ప్రాతినిధ్యం కల్పిస్తూ అగ్రాసనం వేయటంపై ఆయా వర్గాలలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తంగా ఏడుగురికి పెద్దల సభలో ప్రాతినిధ్యం కల్పించినట్టయ్యింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ నుంచి ఎస్సీ సామాజికవర్గం నుంచి పండుల రవీంద్రబాబు, కాపు సామాజికవర్గం నుంచి తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆవిర్భావం నుంచి పార్టీ పట్ల అంకిత భావంతో ఆ సామాజికవర్గం నుంచి ఇజ్రాయేల్ ఉన్నారు. ఇందుకు ప్రతిఫలంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ అవకాశాన్ని ఇజ్రాయేల్‌కు కల్పించారు.

ఎంపీ అనురాధ శుభాకాంక్షలు

అల్లవరం: విజయం సాధించిన ఇజ్రాయిల్‌కు ఎంపీ చింతా అనురాధ, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ తదితరులు అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇజ్రాయిల్ గెలుపుతో గోడిలోని ఆయన నివాసం వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. జై జగన్.. జైజై జగన్ అంటూ అభిమానులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

రబీధాన్యం కొనుగోలుకు ప్రణాళిక

- పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కుమార్
- అధికారులు, సిబ్బందితో సమావేశం



సమావేశంలో పాల్గొన్న కుమార్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రబీ సీజన్‌కు సంబంధించి 337 ఆర్బీకేల పరిధిలో నిర్వహిస్తున్న 239 కేంద్రాల ద్వారా 4.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే దిశగా పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ ఎ.కుమార్ అన్నారు. రబీ ధాన్యం సేకరణపై శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, తూనికలు కొలతలు, వ్యవసాయ, మార్కెటింగ్, డీఆర్డీఏ సమన్వయ శాఖల క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు లాగిన్‌పై సూచనలు, ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతులకు షెడ్యూల్ ఇవ్వడం, షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేసే ప్రక్రియ పరిశీలన, సాంకేతిక సహాయకుల లాగిన్, సేకరణ విధానం, రీషెడ్యూల్ ప్రక్రియ, అలాట్ మెంట్, ట్రక్ షీట్ రూపకల్పన తదితర వాటిపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ రైతుకు కనీస మద్దతు ధర అందజేసే క్రమంలో దళారులు, మిల్లర్లు, మూడో పార్టీ వ్యక్తుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకే స్థాయిలో సలహా, సంప్రదింపులు జరిపి రైతుకు లాభసాటిగా వ్యవసాయం ఉండేలా చూడాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పి.ప్రసాదరావు మాట్లాడుతూ వ్యవసాయ, పౌరసరఫరాల, తూనికలు కొలతలు, మార్కెటింగ్, సచివాలయ వ్యవస్థ, ఆర్బీకే, వేబ్రిడ్జి నిర్వాహకుల వరకూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. నాణ్యత, తూకం, కనీస మద్దతు ధర విషయంలో మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా సహకారసంస్థ అధికారి నాగభూషణం, ఏఎస్‌వో త్రినాథరావు పాల్గొన్నారు.

27న నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్-జిల్లా ఔట్‌రీచ్ ప్రోగ్రాం జరగనుంది. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఈవిషయం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఖాతాదారులు ఈసేవలు వినియోగించుకోవచ్చునన్నారు. భవిష్యనిధి అంతిమ ఉపసంహరణ, ఖాతాల బదిలీ తదితర అంశాలకు సంబంధించి పరిష్కరిస్తామన్నారు. తూర్పుగోదావరిజిల్లా పరిధిలో పెద్దాపురంలో శ్రీలలితా ఎంటర్‌ప్రైజస్ ఇండస్ట్రీస్(ప్రై)లిమిటెడ్ ఆవరణలోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం వేదాంత లిమిటెడ్ ఆవరణలో, అల్లూరి సీతారామరాజుజిల్లా పరిధిలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్మెంట్ రిసోర్స్‌సెంటర్ ఆవరణలో, కాకినాడజిల్లా పరిధిలో కాకినాడ ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలో, ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అటానమస్ కాలేజ్ ఆడియో విజువల్ హాల్‌లో, పశ్చిమగోదావరిజిల్లా పరిధిలో భీమవరం ఈపీఎఫ్‌వో జిల్లా కార్యాలయంలో ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయాప్రాంతాల్లో పెన్షన్ అర్హత,లెక్కించడం, క్లెయిమ్,ఉపసంహరణ..స్కీమ్ సర్టిఫికెట్, ఈ-నామినేషన్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈపీఎఫ్‌వోసభ్యులు, ఫించనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈఅవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

పంట కాలువ గల్లంతు

- మట్టితో పూడ్చేసి పంటభూమిగా మార్చేసిన వైనం
- ఫలితంగా చాగల్నాడు నీరు అందని రైతాంగం
- బాధ్యులకు ప్రాథమిక నోటీసులిచ్చిన అధికారులు



నాయకంపల్లి వద్ద చాగల్నాడు కాలువ పూడ్చివేయకముందు.

రంగంపేట: సాగునీరందించే కాలువను కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకు మింగేశారు. కనీసం ఆనవాలు లేకుండా మట్టితో పూడ్చి పంట భూమిగా మార్చేశారు. తాజాగా మేలుకొన్న అధికారులు కాలువను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వివరాలివి. మెట్టప్రాంతమైన రంగంపేట మండలాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసేందుకు 2004లో రూ.70 కోట్లతో చాగల్నాడు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా రంగంపేట మండలంలో 15 గ్రామాలకు చెందిన 14 వేల ఎకరాలకు నీరందించడానికి రెండు ప్రధాన పంట కాలువలను నిర్మించారు. ఇందులో ఒక కాలువను మండలంలోని వడిశలేరు నుంచి మర్రిపూడి వరకు 21 కిలో మీటర్ల పొడవున నిర్మించారు. ఈ కాలువ ద్వారా పై రెండు గ్రామాలతో పాటు మధ్యలో ఉన్న రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి గ్రామాలకు కూడా సాగునీరు అందుతుండేది.

మరమ్మతులు లేక..

పంట కాలువకు సరైన మరమ్మతులు లేక పూడుకుపోయి పూర్తి ఆయకట్టుకు నీరందించలేకపోయేది. 2020లో రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సొంత నిధులు వెచ్చించి పూర్తి స్థాయిలో కాలువకు మరమ్మతులు చేయించారు. ఫలితంగా చాలామటుకు నీరు అందుతుండేది. ప్రభుత్వ ఎత్తిపోతల పథకం నిబంధనల మేరకు మొదటి పంటకు నీరు విడుదల చేస్తుంటారు. రంగంపేట మండలం పెదరాయవరం, గండేపల్లి మండలం నాయకంపల్లి సరిహద్దు వద్ద ఈ కాలువపై కొందరు గుర్తు తెలియని వ్యక్తుల కన్ను పడింది. 8 మీటర్ల వెడల్పు, 750 మీటర్ల పొడవు గల కాలువ ప్రాంతాన్ని గుట్టుచప్పుడు కాకుండా మట్టితో పూడ్చేశారు. పంట భూమిగా మార్చేశారు. కాలువకు అటు, ఇటు యథాతథంగా ఉండగా మధ్యలో సుమారు కిలో మీటరు పొడవునా పూడ్చివేశారు. పూడ్చేసిన భూమి నాయకంపల్లికి చెందిన 284, 287 సర్వే నంబర్లలో ఉన్నట్లు గుర్తించారు.

సాంకేతిక తప్పిదమే కారణమా..

పూడ్చివేసిన కాలువ ప్రాంతంలో మొదటి నుంచి చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. పంట సమయంలో నీరు పారుతున్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు కాలువకు అడ్డంగా పెద్ద పెద్ద అడ్డుకట్ట వేసేవారు. అడపాదడపా సాగునీటి అధికారులు, రైతులు గుర్తించి అడ్డుకట్టలను తొలగించేవారు. ఈ వ్యవహారంలో చిన్న సాంకేతిక సమస్య ఉన్నట్లు తెలిసింది. కాలువ భూసేకరణ తరువాత ప్రభుత్వానికి చెందిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి. 95 శాతం భూమిని రంగంపేట మండలం రెవెన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. మిగతా ఐదు శాతం భూమి వివరాలను గండేపల్లి మండల రెవెన్యూ అధికారులు నమోదు చేయలేదని తెలిసింది. ఇదే ఇప్పుడు కాలువ పూడ్చి వేసిన వారికి కలిసొచ్చింది.

రంగంలోకి దిగిన అధికారులు....

పంట కాలువ గల్లంతు కావడంతో విస్తుపోయిన చాగల్నాడు అధికారులు ఎట్టకేలకు రంగంలోకి దిగారు. యుద్ధ ప్రాతిపదికన కాలువ పునరుద్ధరణకు పూనుకుంటున్నారు. పూడ్చివేత ప్రాంతమున్న భూమికి చెందిన రైతులకు ప్రాథమిక నోటీసులు అందజేశారు. కాలువ పూడ్చివేయడం వల్ల కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాలకు చాగల్నాడు నీరు అందడం లేదు. దీనిపై మర్రిపూడి రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలువను పునరుద్ధరించాలని ఎంపీపీ రిమ్మలపూడి సత్య శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేస్తున్నారు.



నాయకంపల్లి వద్ద కాలువ పూడ్చి పంటభూమిగా చేసిన వైనం.

వివాహితకు న్యాయం చేయాలంటూ ఆందోళన



ధర్నాలో పాల్గొన్న మహిళలు

ఉప్పలగుప్తం: పెళ్లి చేసుకుని కొన్ని రోజుల కాపురం చేసి వదిలేసిన వ్యవహారంలో భార్యకు న్యాయం చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెంలో భర్త ఇంటి వద్ద బాధితురాలు హేమలతతో కలసి గురువారం ఈ ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఐ.హేమలత డిగ్రీ వరకు చదువుకుంది. 2018లో భీమనపల్లి పంచాయతీ శివారు సూదాపాలెంకు చెందిన ఇళ్ల రమేష్‌తో పెద్దల సమక్షంలో వివాహం కుదిరింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి వాయిదా పడి 2020 డిసెంబర్ 24న హేమలత రమేష్‌లకు వివాహం జరిగింది. 48 రోజులు హేమలతతో కాపురం చేసిన రమేష్ అనంతరం తనకు పెళ్లి ఇష్టం లేదని, హేమలతను పుట్టింటికి పంపి తాను హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు హేమలత ఐద్వాను ఆశ్రయించడంతో హేమలత భర్త రమేష్ ఇంటి వద్ద ఐద్వా మహిళలు ఆందోళనకు దిగి హేమలతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రమేష్ కుటుంబ సభ్యులను సంప్రదించగా తమకు ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేదని, రమేష్ ఆచూకీ కూడా తెలియదని చెప్పారని ఐద్వా సంఘ మహిళలు తెలిపారు. ఈ విషయమై అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఆందోళనలో ఐద్వా సంక్షేమ జిల్లా అధ్యక్షురాలు ఎం.డి.అమీదా, కార్యదర్శి టి.నాగలక్ష్మి, గ్రామ కమిటీ సభ్యులు రాయుడు గౌరీ, గుత్తుల తేజకుమారి, డి.దుర్గాభవాని, వి.దుర్గ, ఆర్.దేవి, వి.జ్యోతి పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- మార్కెట్‌పై రైతుల సంతృప్తి
- కిలో గరిష్ట ధర రూ.210
- సగటు రేటు రూ.206
- ఐదు వేలం కేంద్రాల్లో మొదలైన విక్రయాలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం పొగాకు కొనుగోళ్లు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.59 గంటలకు దేవరపల్లి వేలం కేంద్రంలో బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ కొనుగోళ్లు ప్రారంభించగా, గోపాలపురం వేలం కేంద్రంలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. కిలో పొగాకు ప్రారంభ గరిష్ట ధర రూ.210 పలికింది. గత ఏడాది కిలో ప్రారంభ ధర రూ.195 కాగా, కొనుగోళ్లు ముగిసేనాటికి రూ.245 పలికింది. ఈ ఏడాది మార్కెట్లో ప్రారంభ ధరపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే కిలోకు రూ.15 అదనంగా పెట్టి ప్రారంభ ధరను నిర్ణయించడంతో భవిషత్‌లో మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దేవరపల్లి వేలం కేంద్రానికి చెరుకుమిల్లి క్లస్టర్ నుంచి 18 బేళ్లు, తూర్పుగోదావరి జిల్లా తొర్రేడు వేలం కేంద్రం(ప్రస్తుతం లేదు) పరిధిలోని గ్రామాల నుంచి తొమ్మిది బేళ్లు రైతులు వేలానికి తీసుకువచ్చారు. తొలిరోజు వేలం కేంద్రంలో 3,758 కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో సగటు ధర రూ.206 పలికింది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి.



గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని ప్రారంభించి, పొగాకును పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రారంభ ధర కిలో రూ.225 ఆశించాం



కిలో పొగాకు ప్రారంభ ధర రూ.225 ఉంటుందని అనుకున్నాం. కొనుగోలుదారులు రూ.210 ఇచ్చారు. సగటు ధర రూ.220 ఇస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఉత్పత్తి వ్యయం 30 శాతం పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేయాలి.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు వేలం కేంద్రం, దేవరపల్లి

ఖర్చులు పెరిగాయి



తూర్పుగోదావరి జిల్లాలోని తొర్రేడు వేలం కేంద్రం పరిధిలోని ఉత్తర నల్లరేగడి భూముల్లో(ఎస్‌ఎల్‌ఎస్) పండిస్తున్న పొగాకును దేవరపల్లి వేలం కేంద్రంలో అమ్ముకోవలసి వస్తుంది. దీనివల్ల బేలుకు రూ.250 రవాణా ఖర్చులు అవుతున్నాయి. పెట్టుబడి తక్కువైనప్పటికీ రవాణా, ఎరువులు, బంటా, క్యూరింగ్ ఖర్చులు ఎక్కువ. 1,057 మంది రైతులు, 1,450 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– కాట్రగడ్డ సత్యనారాయణ, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, తొర్రేడు

నాణ్యత బాగుంది



ఈ ఏడాది పొగాకు నాణ్యత, దిగుబడులు బాగున్నాయి. మార్కెట్ కూడా ఆశాజనకంగా ఉంటుందని అనుకుంటున్నాను. తొలి రోజు ఐదు వేలం కేంద్రాల్లో కిలో ప్రారంభ ధర రూ.210 పలికింది. మార్కెట్లో అమ్ముడు పోయే బేళ్లను రైతులు వేలం కేంద్రాలకు తీసుకురావాలి. క్లస్టర్ వారీగా వేలం జరుగుతుంది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొని కొనుగోలు చేశాయి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు, రాజమహేంద్రవరం

అరుణ కాంతులీనిన రామలింగేశ్వరుడు



అరుణ కిరణ కాంతిలో రామలింగేశ్వరుడు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వరుడిని గురువారం సూర్య కిరణాలు తాకాయి. అరుణ కిరణ కాంతిలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భానుడి స్పర్శతో గర్భాలయం వెలుగులీనింది. ఏటా మార్చి, సెప్టెంబర్‌లలో రెండు సార్లు సూర్య కిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

నేటి నుంచి పవిత్ర రంజాన్



రంజాన్ దీక్షల కోసం ముస్తాబైన మామిడికుదురు సున్నీ జామియా మసీదు

- ముస్లింల ఉపవాస దీక్షలు
- ముస్తాబైన మసీదులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ అవతరించింది. రంజాన్ అంటే ఒక నెల పేరు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం తొమ్మిదో నెల. ఈ నెలలో ముస్లింలు ఉపవాసాలు పాటిస్తూ తమను తాము సంస్కరించుకుంటూరు. అల్లాహ్‌పై విధేయతను ప్రకటిస్తూ, అల్లా విధించిన కట్టుబాట్లను ఆచరిస్తూ క్రమశిక్షణ జీవితాన్ని గడుపుతారు. ఉపవాసం మనలోని మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడును దూరం చేసి సత్ప్రవర్తన వైపు నడిపిస్తుంది

ఉపవాస నియమాలు

వేకువజామున 4:30 గంటల లోపు (సహరి) భోజనాది కార్యక్రమాలు పూర్తిచేయాలి. మళ్లీ సాయంత్రం 6.30 వరకు (ఇఫ్తార్) వరకు ఎటువంటి ఆహారం, నీరు తీసుకోకూడదు. రోజా సుమారు 14 గంటల వరకు ఈ ఉపవాస దీక్ష ఉంటుంది. సహరితో మొదలై ఇఫ్తార్‌తో రోజా ముగుస్తుంది. ఉపవాసం ఉన్న వ్యక్తి చెడు తలంపులకు దూరంగా ఉండాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఘర్షణలకు దిగకూడదు. ఎవరైనా ఘర్షణకు దిగినా, నేను ఉపవాసంలో ఉన్నానంటూ చెప్పాలి.

ఇఫ్తార్ సమయం

సహనం మన జీవితంలో భాగమయ్యేటట్లు ఇఫ్తార్ చేస్తుంది. సుమారు 14 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షలో ఉన్న వ్యక్తి ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయంలో కాస్త నీరసంగా కనిపిస్తారు. కళ్ల ముందే అన్ని రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కానీ నిర్ణీత ఉపవాస విరమణ ఘడియ వచ్చే వరకు ఏ ఒక్క ఆహార పదార్థాన్ని తాకరు. సహనం వీడరు. ఎవరైతే కష్టసమయంలో సహనం, ఓర్పు వహిస్తారో వారిపై తన కరుణ ఎల్లప్పుడూ ఉంటుందని అల్లాహ్ ఖురాన్‌లో తెలిపారు.

ఉపవాస దీక్ష లక్ష్యాలు

ఉపవాసాల లక్ష్యం ఏమిటంటే మనలో భయభక్తులు, దైవభీతి, జవాబుదారీతనం జనించాలని, దైవంపై కృతజ్ఞతాభావం కలగాలని, అందరికీ ఉత్తమ నైతిక గుణగణాలు అలవడి వారి ద్వారా ఒక మంచి శాంతి నైతికతా సమాజం ఏర్పడడం. నెలరోజులు పాటు ఉపవాసాల శిక్షణ రాబోయే 11 నెలలు కొనసాగించడమే దీనిస్ఫూర్తి.

కనిపించిన నెలవంక

నెలవంక రాకతో రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి నెలవంక కనిపించింది. దీనితో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు ముస్లిం ప్రతినిధులు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి.



ఆలయంలో పందిరి రాట వేస్తున్న దృశ్యం

వెంకన్న కల్యాణానికి పందిరి రాట

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పందిరి రాటను ఆలయ అర్చకులు నిలిపారు. తొలుత సన్నాయి మేళాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 31 నుంచి వారం రోజులపాటు స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ నెల 31న స్వామివారి ధ్వజారోహణ, నిత్యబలిహరణ, దర్శనాలు, ఏప్రిల్ ఒకటిన స్వామి వారి తీర్థం, రథోత్సవం, కల్యాణం, 2న స్వామి వారి మేలుకొలుపు, సేవ, ప్రధాన హోమాలు, 3న పొన్నవాహన మహోత్సవం, 4న సదస్యం, మహదాశీర్వచనం, 5న గోదావరి నదిలో తెప్పోత్సవం, 6న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, 7న పుష్పయాగం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు వివరించారు.

స్వీడెన్ బ్లేకింగ్ యూనివర్సిటీతో జేఎన్‌టీయూకే ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న బ్లేకింగ్ వర్సిటీ వీసీ మార్ట్స్ వైబెర్గ్, జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే స్వీడన్‌లో బ్లేకింగ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీతో కొనసాగిస్తున్న కోర్సుల నిర్వహణపై గురువారం రెండు యూనివర్సిటీల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే స్వీడన్‌లోని బ్లేకింగే యూనివర్సిటీ ద్వారా కుదుర్చుకున్న కోర్సుల ఒప్పందం యథావిధిగా కొనసాగించడంతోపాటు ఆదరణ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సు ఈ ఏడాది అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అడ్మిషన్‌కు నోటిఫికేషన్ జారీ చేసి ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంవోయుపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. బ్లేకింగ్ అధికారులు బృందం జేఎన్‌టీయూకేలో ఈసీఈ, సీఎస్ఈ విభాగాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించింది. వీసీ ప్రొఫెసర్ మార్ట్స్ వైబెర్గ్, డిప్యూటీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గురుదత్త వేల్పుల, కో–ఆర్డినేటర్ ఫణిశేఖర్, జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డీఏఏ సీహెచ్ సాయిబాబు, డీఏపీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర, డీఈ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటికలు

రావులపాలెం: ఉగాది పండగను పురస్కరించుకుని రావులపాలెంలోని కాస్మొపాలిటన్ రిక్రియేషన్‌క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 23వ ఉగాది జాతీయ తెలుగు నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. రెండో రోజు పోటీలను తిలకించేందుకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు తనికెళ్ళ భరణి, సినీనటులు కోట శంకరరావు, గౌతంరాజు, నైనా, కృష్ణ చైతన్య, తదితరులు హాజరయ్యారు. గురువారం మూడు నాటికలు ప్రదర్శించారు. వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి వారి ఫ్రీడమ్ ఫైటర్, హైదరాబాద్ కళాంజలి వారి రైతేరాజు, కాకినాడ శ్రీ సాయి కార్తిక్ క్రియేషన్ వారి ఎడారిలో వాన చినుకు నాటికలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగ మోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి పర్యవేక్షించారు.



ఫ్రీడమ్ ఫైటర్ నాటికలో ఆకట్టుకున్న ఒక సన్నివేశం

ఫ్రీడమ్ ఫైటర్

తన జీవితాన్ని మాతృభూమి కోసం తృణ ప్రాయంగా వదిలేసి, వ్యక్తిగతంగా ఎన్నో సంఘర్షణలను అనుభవించి ఒక స్వాతంత్య్ర సమరయోధురాలు ఈ సమాజానికి సంధించిన ప్రశ్న మా ఈ ఫ్రీడమ్ ఫైటర్ అంటూ సాగిన నాటిక ఆకట్టుకుంది.

రైతేరాజు

ఇవాళ టెక్నాలజీ పెరిగింది. పిడికిడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్నే శాసిస్తున్నారు. కానీ రైతు పండించే పిడకడంతా అన్నం తినకుండా ఏ మనిషీ బతకలేడు. అలాంటి రైతన్నను పట్టించుకునే నాథుడే లేడు. గుండుసూది నుంచి విమానం దాకా ఏ వస్తువైనా తయారు చేసిన వాడు తన వస్తువు రేటు నిర్ణయించుకుంటాడు. రైతుకు మాత్రం రేటు నిర్ణయించుకునే హక్కు లేదు. రైతు కన్నెర్ర చేస్తే, పంటకు సెలవు ప్రకటిస్తే, ఆలోచించమని చెప్పే నాటికే రైతే రాజు.

ఎడారిలో వాన చినుకు

సురేష్ తన తల్లిదండ్రులైన శారదమ్మ, సుందరయ్యలను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ వారిని తల్లిదండ్రులుగా దత్తత తీసుకుందామని అనుకుంటే, సురేష్ వారిని పాతిక లక్షల రూపాయలకు బేరం పెడతాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఎడారిలో వాన చినుకు నాటిక సారాంశం. ఈ నాటిక ప్రేక్షకులకు కంటనీరు పెట్టించింది.

క్రైం కార్నర్..

భార్యపై హత్యాయత్నానికి 10 ఏళ్ల జైలు

పిఠాపురం: భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను అంతం చేయాలని ప్రయత్నించి హత్యాయత్నం చేసిన భర్తకు న్యాయమూర్తి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం ముమ్మిడి సుబ్రహ్మణ్యం, భార్య సుబ్బలక్ష్మి పిఠాపురం ఐశ్వర్య గార్డెన్స్‌లో నివాసముండేవారు. భర్త సుబ్రహ్మణ్యం సౌత్ ఈస్టన్ సెంట్రల్ రైల్వేలో బిలాస్‌పూర్ మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పిఠాపురంలో ఉంటూ సుదూర ప్రాంతానికి ఉద్యోగం కోసం వెళ్లి వస్తుండే అతను.. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె పేరున ఉన్న 10 ఎకరాల భూమిని తన పేరుపై రాయాలంటూ ఒత్తిడి తెచ్చేవాడు. అయితే 'నా ఆస్తి మన ఇద్దరికీ చెందుతుంది. మీ పేరున రాయడం ఎందుకు అంటూ' భార్య వ్యతిరేకించడంతో ద్వేషం పెంచుకున్నాడు. ఎలాగైనా ఆమెను అంతం చేయాలని పన్నాగం పన్నాడు. 25 మే 2018వ తేదీన ఇంటి వద్దే ఉన్న భర్త తన భార్యను తీసుకుని కొత్తపల్లి మండలం కొండెవరం బంధువుల ఇంటికి వెళ్లి వచ్చాడు. ఆరోజు రాత్రి 9–30 గంటల ప్రాంతంలో భార్య నిద్రపోగానే ఆమెపై మత్తు మందు చల్లాడు. ఆమె మత్తులోకి వెళ్లి పోగానే కత్తితో విచక్షణారహితంగా నరికి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమెకు రెండు చేతులు మణికట్టు వద్ద తెగిపోగా పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఆ మరునాడు ఉదయం 6 గంటల సమయంలో మత్తు వదలి మెలుకువ వచ్చిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై 26 మే 2018లో అప్పటి పిఠాపురం పట్టణ ఎస్సై శోభన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.మాధవి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ దామెర కిరణ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గంజాయి ముఠా అరెస్టు

రౌతులపూడి: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాపై రౌతులపూడిలో దాడి చేసినట్లు అన్నవరం ఎస్సై పి.శోభన్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నాడని ఎస్సై వివరించారు. కేరళ రాష్ట్రానికి చెందిన మహ్మద్ స్వాలై తెక్కరతోడిక, అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పల్లావూరు గ్రామానికి చెందిన పల్లా వరహాలబాబు, అదే జిల్లా కేడీ పేట గ్రామానికి చెందిన ఉప్పాటి వెంకటేష్‌లను అరెస్టు చేయగా సయ్యద్ ఉద్దీన్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి రూ. 22 కేజీల గంజాయి స్వాధీన పరుచుకున్నామన్నారు. దీని విలువ రూ.66 ఉంటుందన్నారు. మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అభిలాష్ (ఫైల్)

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై మోటారు సైకిల్ అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కోలాటి అభిలాష్(29) మృతిచెందాడు. గురువారం తెల్లవారు జామున రాజమహేంద్రవరం నుంచి మోటారు సైకిల్‌పై కొవ్వూరు వైపు వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజమహేంద్రవరంలో ప్రయివేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణ ఎస్సై డి.భూషణం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కోలాటి కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య

పిఠాపురం: మున్సిపల్ ఉద్యోగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో 15 ఏళ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న ఆర్.గోవిందరాజులు (42) స్థానిక అగ్రహారం రెల్లిపేటలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.